సాక్షి
వరంగల్
గురువారం । 8 । మే । 2025



ఆశించినమేర పనులు జరగలేదు

మూడు పిప్పల్లో పుష్కరాల పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్‌రావు అన్నారు. - 10లో▸



ప్రతి పేదవాడికి అండగా ఉంటాం

ప్రతి పేదవాడికి అండగా నిలుస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్ మంత్రి పొంగులేటి అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
36.4°/26.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జిలకు సన్మానం



వరంగల్ లీగల్ : ఇటీవల వెలువడిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో వరంగల్ జిల్లాకు చెందిన న్యాయవాదులు గంగిశెట్టి ప్రసీద, అంబటి ప్రణయ, దార సాయిమేఘన తొలి ప్రయత్నంలోనే ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని అంబేడ్కర్ హాల్‌లో వారిని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్లు సంయుక్తంగా సన్మానించారు. కార్యక్రమానికి అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీలు డి.రమాకాంత్, కొత్త రవి, ఇతర బాధ్యులు మైదం జయపాల్, మునిపట్ల శ్రీధర్‌గౌడ్, రేవూరి శశిరేఖ, శివప్రసాద్, కిషోర్‌కుమార్, బైరపాక జయాకర్, సీనియర్ న్యాయవాదులు అంబరీష్ రావు, వద్దిరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సంగెం: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు హెచ్చరించారు. సంగెంలోని గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు తనిఖీ చేశారు. పిల్లల టీకాల ప్రోగ్రాంను పరిశీలించారు. చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఉదయం సాయంత్రం వేళల్లో పని చేసుకోవాలని మధ్యాహ్నం ఎండలో పనులు మానుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్లాంటేషన్‌లోని చెట్ల నరికివేత



నెక్కొండ: అటవీ ప్లాంటేషన్‌లోని చెట్లు నరికేసిన ఘనటలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నెక్కొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. నర్సంపేట రెంజ్ పరిధి నెక్కొండ సెక్షన్‌లోని సూరిపల్లి శివారు రాంపూర్ తండాలోని అటవీ జాతుల బ్లాక్ ప్లాంటేషన్‌లో కొందరు చెట్లు నరికేశారు. ఈవిషయం తెలుసుకున్న ఎఫ్‌బీఓ నవీన్ ఘటనాస్థలిని బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నరికివేసిన చెట్ల వివరాలను నమోదు చేసుకున్నామన్నారు. సుమారు రూ.19 వేల నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన తండాకు చెందిన దరావతు శివరాం, వీరన్నపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఎవరికీ అనుమతులు లేవన్నారు. చెట్ల నరికి వేతకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

12న ఫార్మసీ ఆఫీసర్స్ ఫలితాలు

ఎంజీఎం : ఫార్మసీ ఆఫీసర్స్ ఫలితాలు ఈనెల 12న ప్రకటించనున్నట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూమెంట్ బోర్డు చైర్మన్ గోపికాంత్ రెడ్డి తెలిపినట్లు తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) సెంటర్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రిక్రూమెంట్ బోర్డు చైర్మన్‌ను కలిసిన టీజీపీఓఏ నాయకులు ఫార్మసీ ఫలితాల ప్రకటనపై చర్చించారు. దీనిపై బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సమావేశంలో టీజీపీఓఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంద కట్ల శరత్ బాబు, అడ్వైజర్ అహ్మద్ ఉల్లాఖాన్ ఉన్నాం

మూడంచెల భద్రత..



ఓరుగల్లులో ప్రపంచ సుందరీమణుల పర్యటన

- ఈనెల 14న రెండు బృందాలుగా 57 మంది రాక
- రామప్ప, వరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం సందర్శన
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- అదనపు సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- హైదరాబాద్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం



సాక్షిప్రతినిధి, వరంగల్ : ప్రపంచ సుందరీమణుల పర్యటన నేపథ్యంలో ఓరుగల్లులో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, పర్యాటక తదితర శాఖల ఆధ్వర్యాన అతిథులను ఆకట్టుకునేలా పర్యాటక ప్రాంతాలను ముస్తాబు చేస్తున్నారు. ప్రధానంగా ప్రపంచ దేశాల నుంచి వస్తున్న సుందరీమణులకు మూడంచెల పోలీసు భద్రతతో పాటు అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ ట్రైసిటీతో పాటు రామప్పలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను వారి పర్యటన ముగిసే వరకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) నుంచి కూడా పర్యవేక్షించేలా అనుసంధానం చేస్తున్నారు. బుధవారం నుంచి ఆయా పనులు ఊపందుకున్నాయి.

సీసీ కెమెరాల నిఘా..

నగరంలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసుశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు 49 వేల వరకు ఉన్నాయి. అలాగే 'స్మార్ట్‌సిటీ' నిధులతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 750 సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్నారు. అయితే వీటికి తోడు సుందరీమణుల పర్యటన నేపథ్యంలో హరిత కాకతీయ, వరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయాలతో పాటు కీలక ప్రదేశాల్లో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనిలో అధికారయంత్రాంగం నిమగ్నమైంది. రామప్ప ఆలయ ప్రాంగణం, బయట సుమారు 50 నుంచి 70 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించే వీలుగా అనుసంధానం చేస్తుండడం చర్చనీయాంశం అవుతోంది.

హైదరాబాద్ నుంచి రామప్ప, ఓరుగల్లుకు..

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించే మిస్‌వరల్డ్–2025 పోటీలకు 144 దేశాల నుంచి సుందరీమణులు చేరుకుంటున్న విషయం తెలిసిందే. అందులో 57 మంది రెండు బృందాలుగా ఈనెల 14వ తేదీన రామప్ప, వరంగల్‌లోని వేయి స్తంభాల దేవాలయం, వరంగల్ కోటను సందర్శించనున్నట్లు అధికారులు ప్రకటించారు. 35 మందితో కూడిన ఓ బృందం హైదరాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి రామప్పకు వెళ్తుంది. 22 మంది సభ్యుల మరో బృందం అదే సమయానికి బయల్దేరి వరంగల్ హరిత కాకతీయకు చేరుకుంటుంది. వీరికి స్వాగతం పలకడం.. పర్యాటక ప్రదేశాలు, ఆలయాలను చూపించడం.. కాకతీయ రాజుల పాలన, కళాసంపద, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా దేశాలకు చెందిన సుందరీమణులు నచ్చే, మెచ్చే వంటకాలను కూడా ప్రభుత్వం తరఫున సిద్ధం చేస్తున్నారు. అలాగే హనుమకొండ హరిత కాకతీయకు చేరుకునే 22 మంది సుందరీమణులు, వారి వెంట వచ్చే మరో ఇద్దరు మహిళల కోసం రూమ్‌లు కేటాయించారు. వీరికి మూడంచెల భద్రతలో భాగంగా ఒక్క హరిత కాకతీయ హోటల్ ప్రాంగణంలో సుమారు ఐదువందల మందికి పైగా భద్రతా సిబ్బందిని కేటాయించనున్నట్లు చెబుతున్నారు. వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్పలోనూ పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

భద్రతపై అధికారుల సమీక్షలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు(ఫైల్)

మిస్ వరల్డ్–2025 పోటీలకు వచ్చే సుందరీమణుల ఓరుగల్లు పర్యటన నేపథ్యంలో వారి భద్రత విషయమై అధికారులు రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, హనుమకొండ, వరంగల్, ములుగు కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, దివాకర, వివిధ శాఖల ఉన్నతాధికారులు పలుమార్లు భేటీ అయ్యారు. ఇదే సమయంలో మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘాపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది.

దంతం.. అందని వైద్యం

ఎంజీఎం ఆస్పత్రిలోని డెంటల్ విభాగాన్ని డాక్టర్ల కొరత వెంటాడుతోంది. ఇంత పెద్ద ఆస్పత్రికి ఉన్నది ఇద్దరు వైద్యులు. అందులో ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఉన్నది ఒకే డాక్టర్. కాంట్రాక్టు పద్ధతిన దంత వైద్యుల నియామకానికి మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేసినా నేటికీ ప్రక్రియ పూర్తి చేయలేదు. ఏదైనా అసరమై ఆ ఒక్క డాక్టర్ రాకుంటే ఇక ఆ విభాగానికి సెలవే. దీంతో పంటి సమస్యలతో వచ్చిన రోగులు చుక్కలు చూడాల్సిందే.

- ఎంజీఎంలో డెంటల్ డాక్టర్ల కొరత
- నోటిఫికేషన్ ఇచ్చారు.. నియామకం మరిచారు
- ఇద్దరు వైద్యుల్లో ఒకరు డిప్యుటేషన్‌లో..
- రోగులకు ఒకే అసిస్టెంట్ ప్రొఫెసర్ దిక్కు
- ఆస్పత్రికి వచ్చే రోగులకు తప్పని పాట్లు



పేషెంట్‌తో మాట్లాడుతున్న వైద్యురాలు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రికి వస్తే మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఇన్‌చార్జ్‌ల పాలన రోగులకు శాపంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలకు దంత వైద్యం కోసం ప్రభుత్వ పరంగా ఎంజీఎం ఆస్పత్రి పెద్ద దిక్కు. రోజూ వందలాది మంది దంత సమస్యలతో చికిత్స నిమిత్తం వస్తూ ఉంటారు. ఇంత పెద్ద డెంటల్ వైద్య విభాగాన్ని నిత్యం పర్యవేక్షించాల్సిన హెచ్‌ఓడీని డిప్యుటేషన్‌పై హెల్త్ యూనివర్సిటీకి పంపించడంతో విభాగం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సదరు హెచ్‌ఓడీ డిప్యుటేషన్ ఏళ్ల తరబడి కొనసాగుతుండడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదు. ప్రస్తుతం దంత వైద్య విభాగం మూలన పడే పరిస్థితి నెలకొంది. రోజూ ఆస్పత్రికి వందమందికిగా పైగా డెంటల్ సమస్యలతో వచ్చే రోగులకు ఒకే అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. పళ్ల తొలగించడం, చికిత్స చేయడం తదితర వైద్యసేవలు భారంగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల గంట తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏదైనా సందర్భంలో ఆ డాక్టర్ సెలవుపై వెళ్తే దంత వైద్య విభాగం సేవలు నిలిచిపోయినట్టే.

నోటిఫికేషన్‌తో సరి..

ఎంజీఎం ఆస్పత్రి దంత వైద్యవిభాగంలో వైద్యుల కొరత తీర్చడానికి కలెక్టర్ ఆదేశాలతో పరిపాలనాధికారులు రెండు పోస్టులకు ఈ ఏడాది మార్చి 21వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. 22 నుంచి 24వ తేదీ వరకు ఆసక్తి ఉన్న దంత వైద్య అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వారం రోజుల్లోగా మెరిట్ జాబితా తయారు చేసిన అధికారులు ఇంటర్వ్యూ ప్రక్రియ పూర్తి చేసి 30 రోజులు గడుస్తున్నా నియామకం చేపట్టడం లేదు. అభ్యర్థుల ఎంపిక విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సుతో అధికారులు ముందుకు సాగుతూ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాస్టళ్లకు జాయింట్ డైరెక్టర్ల నియామకం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని రెండు హాస్టళ్లకు జాయింట్ డైరెక్టర్లను నియమించినట్లు కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం తెలిపారు. టూరిజం మేనేజ్‌మెంట్ పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావును గణపతిదేవ హాస్టల్–2, 3 బ్లాక్‌లకు, టూరిజం మేనేజ్‌మెంట్ పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ ఎం.కృష్ణసుమంత్‌ను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ హాస్టల్‌కు నియమించారు. ఈమేరకు వీరికి వీసీ కె.ప్రతాప్‌రెడ్డి రిజిస్ట్రార్ రామచంద్రంతో కలిసి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య ఎల్‌పీ.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఈదురు గాలులకు ఎన్పీడీసీఎల్‌కు నష్టం

- జిల్లాల్లో రూ.22.79 లక్షల నష్టం

హన్మకొండ: ఈదురు గాలులకు టీజీ ఎన్పీడీసీఎల్‌కు భారీ నష్టం వాటిల్లింది. ఈనెల 5న రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. దీంతో వరంగల్ జిల్లాలో 22.79 లక్షల నష్టం జరిగింది. జిల్లా మొత్తంలో 293 స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ లైన్లు 4.28 కిలోమీటర్లు దెబ్బతింది. ఆరు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సమస్య తలెత్తిన సమయం నుంచి పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పునరుద్ధరణ పనులు పూర్తి చేశారన్నారు. మరమ్మతు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరా అందించినట్లు హనుమకొండ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు, వరంగల్ ఎస్‌ఈ కె.గౌతం రెడ్డి తెలిపారు. విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉందని, విద్యుత్ సిబ్బంది 24/7 క్షేత్రస్థాయిలో ఉంటున్నారన్నారు. అధికారులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ విద్యుత్ సరఫరాను మానిటర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, అర్ధరాత్రి సైతం లెక్కచేయకుండా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారని అభినందించారు. వినియోగదారులు విద్యుత్‌పై జాగ్రత్త వహించాలని, విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దన్నారు. స్వీయ నియంత్రణ ముఖ్యమని ఎట్టి పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టవద్దని కోరారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912, 180042 50028కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.



విద్యుత్ పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న హనుమకొండ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు

దయనీయ పరిస్థితుల్లో రైతులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట: రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం కారణంగా దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం వర్ధన్నపేట పిరంగిగడ్డ ప్రాంతంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. సాగునీరందించడంతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, తూకాలు వేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసుకున్న ధాన్యం రాశులు, బస్తాలు తడిసి ముద్ద అవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. ఇందులో 10.32 లక్షల టన్నులు సన్నాలున్నాయని, 14.11 లక్షల టన్నులు దొడ్డు వడ్లు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన డబ్బులు ఇంతవరకు రైతులకు అందజేయలేదన్నారు. కొర్రీలు పెడుతూ.. బోనస్ భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం ఇలా చేస్తోందని ఆరోపించారు. నష్టపోయిన రైతులకు పంట నష్టం చెల్లించాలని, తడిసిన ప్రతీ గింజను కొని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, రూ. 500 కోట్ల పెండింగ్ బోనస్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

భూ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

- కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం మండలంలోని కట్ర్యాల, ఇల్లంద గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఆ సమస్యల పరిష్కారానికి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, సర్వే నంబర్ల మిస్సింగ్, పట్టా పాస్ బుక్‌లు లేకపోవడం, ప్రభుత్వ భూముల్ని నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ పార్ట్ బి కింద చేర్చిన భూముల తదితర దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ద్వారా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రకియ పని తీరును పరిశీలించారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

ఇల్లందలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సత్యశారద , డీఆర్డీఓ పీడీ కౌసల్యదేవితో కలిసి పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, తహసీల్దార్ విజయసాగర్, ఏఓ రమేష్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట: రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచేందుకు కెరియర్ క్యాంపులు

న్యూశాయంపేట: ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పెంచేందుకు కెరియర్ క్యాంపులు నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత విద్యాసంవత్సరంలో జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో ఏయే కళాశాలలో తక్కువ శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందుకు గల కారణాలు అధ్యయనం చేసి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్‌బోర్డు నియమ నిబంధన మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల భవనాలకు ఫైర్ సేఫ్టీ తదితర సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్, డీఈఓ జ్ఞానేశ్వర్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మూడు లే–ఔట్‌లకు అనుమతులు

కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన లేఔట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జీడబ్ల్యూఎంసీ పరిధిలో మూడు లేఔట్ అనుమతుల కోసం ప్రతిపాదన రాగా.. వాటిని కమిటీ నిబంధనలు అనుసరించి పరిశీలించి, సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు.

ఒక్క గింజా తడవొద్దు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

దుగ్గొండి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు ఒక్క గింజ కూడా తడవకుండా సరిపడా టార్పాలిన్ షీట్లు రైతులకు అందించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని నాచినపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతూ.. కేంద్రం వద్ద మంచినీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ వసతి ఏర్పాటు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రేకంపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే బిల్లులు మంజూరవుతాయని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఎం రాజుకుమర్, సీసీ బాబు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దంజ్యా నాయక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్

హన్మకొండ: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసే విషయంలో పారదర్శకత పాటించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతమ్ అన్నారు. బుధవారం హనుమకొండ 'కుడా' కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అర్హుల వెరిఫికేషన్ ప్రక్రియపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల డేటా వెరిఫికేషన్ క్షేత్రస్థాయిలో నిబంధనల ప్రకారం సరిచూశాకే నియోజకవర్గ నోడల్ అధికారి ద్వారా జాబితాను కలెక్టర్ లాగిన్‌కు పంపాలన్నారు. పైలట్ గ్రామాల్లో ఇప్పటి వరకు ఇళ్ల ప్రారంభం కాని వారి స్థానంలో ఇతర గ్రామానికి చెందిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించిన ఏఈలు ప్రస్తుతం గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, ఆతర్వాత నగరంలో చేపట్టే నిర్మాణాలను పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు గ్రేటర్ వరంగల్ పరిధిలోని సోమిడి, వడ్డేపల్లి, దేశాయిపేట ప్రాంతాల్లో వెరిఫికేషన్ అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఎండీ గౌతమ్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడేతో కలసి పరిశీలించారు. సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాల్గో సెమిస్టర్(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిమ్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు ఉంటాయని, పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.


ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బైక్ ర్యాలీ

నర్సంపేట : ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ చేపట్టిన ఎదురు దాడికి మద్దతుగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ రోడ్డు చౌరస్తా నుంచి జయలక్ష్మి సెంటర్ వరకు బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్ సింగ్, గోలి యుగేందర్ మాట్లాడారు. ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పారంటూ ప్రధాని మోదీకి, సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల రాంచందర్, గంగిడి మహేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు సందీప్, రామచంద్రారెడ్డి, తదితరులు

మిజోరాం గవర్నర్‌ను కలిసిన మౌంటైనర్ యశ్వంత్


మిజోరాం గవర్నర్ డాక్టర్ విజయ్ కుమార్‌సింగ్‌తో మౌంటైనర్ యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్య తండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ మిజోరాం గవర్నర్ డాక్టర్ విజయ్‌కుమార్ సింగ్‌ను రాజ్‌భవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ మిషన్ 'హర్ శిఖర్ పర్ తిరంగ'లో భాగంగా యశ్వంత్ మిజోరం వెళ్లాడు. అక్కడ గవర్నర్‌ను కలువగా.. తన వంతు ప్రోత్సాహం, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని, విజయం వైపు దూసుకెళ్లాలని యశ్వంత్‌కు సూచించారు.

ఫోన్ పే హ్యాక్

- రూ.63వేలు మాయం

కాటారం: ఫోన్ పే హ్యాక్ అవడం ద్వారా రెండు బ్యాంక్ ఖాతాల్లో నుంచి రూ.63 వేలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కంకణాల సురేందర్‌రెడ్డి స్రవంతిలకు చెందిన రెండు మొబైల్స్‌కు అపరిచిత నంబర్ నుంచి లింకులు వచ్చాయి. వారి కుమార్తె ఆ లింక్‌లను ఓపెన్ చేయడంతో ఫోన్‌పే ద్వారా పలుమార్లు ఖాతాలోని డబ్బులు డెబిట్ అయ్యాయి. సురేందర్‌రెడ్డి ఫోన్‌పేకు చెందిన ఖాతా నుంచి రూ.33 వేలు, స్రవంతి ఫోన్‌పేకు చెందిన ఖాతా నుంచి రూ.30 వేలు పలుమార్లు డెబిట్ కావడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. మెసేజ్‌లు రావడంతో గమనించిన సురేందర్‌రెడ్డి ఆందోళనకు గురై చివరకు ఫోన్‌పే హ్యాక్ అయినట్లు గుర్తించి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శతాధిక వృద్ధురాలికి జన్మదిన వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న బంధువులు

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు జాగాటి వెంకటనర్సమ్మ 100వ జన్మదిన వేడుకలను బంధువుల మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కుమారులు వెంకటయ్య, వీరస్వామి, కుమార్తెలు ఉపేంద్ర, సత్తెమ్మ, మనుమలు, మనమరాళ్లు బంధువులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జనగామ రూరల్: కారుకొనివ్వలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామలోని మరిగడి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూరాకుల కనుకయ్య కుమారుడు కూరాకుల సాయిరాజ్ (22) డ్రైవింగ్ చేసుకునేవాడు. ఈక్రమంలో డ్రైవింగ్ చేయడానికి కారు కొనివ్వమని కొంతకాలంగా తల్లిదండ్రులను కోరాడు. వారు డబ్బులు లేవని నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన సాయిరాజ్ తీవ్ర మనోవేదనకు గురై ఎవరూ లేని సమయంలో తన బావి వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయిరాజ్ తండ్రి కనకరాజు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

ఆశించినమేర పనులు జరగలేదు..

- దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్‌రావు
- సరస్వతీ పుష్కరాల ఏర్పాట్ల పరిశీలన
- మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని సూచన


పనులను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్‌రావు, కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల ఏర్పాట్లలో ఆశించిన మేర పనులు జరగడం లేదని, మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్‌రావు అన్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అధికారులతో కలిసి సరస్వతీనది పుష్కరాల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. వీఐపీ ఘాట్ విస్తరణ, గోదావరి ఘాట్‌లు, టెంట్‌సిటీ, గోదావరి హారతి ప్రాంతం, పుష్కర స్నానాల ప్రాంతం, 86గదుల గెస్ట్‌హౌస్, హెలిపాడ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లకు పలుసూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించి విధులు కేటాయించాలన్నారు. మొట్టమొదటి సారి గా జాయ్‌రైడ్, టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నారని కలెక్టర్‌ను అభినందించారు. సివిల్ పనులు చాలా పెండింగ్ ఉన్నాయని, లోపాలు రావొద్దని తెలిపారు. రానున్న వారం రోజులు చాలా ముఖ్యమని, 24/7 పనులు జరగాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ పనులు నత్తనడకన జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మంత్రి వస్తున్నారని, రూపురేఖలు మారాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో వేగం పెంచాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. షవర్ పనులు పెండింగ్ ఉన్నాయని, గోదావరిలోకి భక్తులు వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. మరుగుదొడ్ల పనుల్లో వేగం పెంచాలన్నారు. ఫుడ్ కోర్టు, స్టాళ్లు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వీఐపీ ఘాట్ రోడ్డు బారికేడింగ్ చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీములు ఏర్పాటు చేయాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పుష్కరాలు పూర్తి అయ్యే వరకు అధికారులకు, సిబ్బందికి ఎలాంటి సెలవులకు అనుమతి లేదని తెలిపారు. ప్రతి రోజు 5వేల మందికి ఉచిత అన్నదానం చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. 15న సీఎం వస్తున్నారని, సరస్వతీమాత విగ్రహం ప్రారంభోత్సవం, పుష్కర స్నానం, దర్శనం, హారతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 5 సెక్టార్లు, 18 జోన్లుగా విభజించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 12వ తేదీ వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలు వీక్షించేలా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రులు దిశానిర్దేశం చేశారని తెలిపారు. అన్నిశాఖలు సమన్వయంతో పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయశాఖ ఆర్జేసి రామకృష్ణారావు, ఈఓ మహేష్, అడిషనల్ ఎస్పీ కిషన్ పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఎస్పీ పరిశీలన

కాళేశ్వరం: సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ భాస్కరన్ బుధవారం ఆయన వీఐపీ, సాధారణ ఘాట్, పార్కింగ్ స్థలాలు, హెలిపాడ్‌లు, ఆలయం తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం కాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనను సన్మానించి, తీర్థప్రసాదం అందజేశారు.

టెంట్‌సిటీ పనులు ప్రారంభం


కాళేశ్వరంలో టెంట్‌సిటీ పనులు

పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం టెంట్‌సిటీ ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం రూ.50లక్షల వ్యయంతో హైదరాబాద్‌కు చెందిన ఆలిఎలిమెంట్ అనే ప్రైవేట్ సంస్థ టెంట్ సిటీ పనులను ప్రారంభించింది. టెంట్‌సిటీ వీఐపీ(సరస్వతి)ఘాట్ సమీపంలో 30 టెంట్ సిటీలు నిర్మిస్తున్నారు. 12 రోజులపాటు భక్తులు బస చేయడానికి వేసవి దృష్ట్యా ఏసీలు టాయిలెట్స్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఒక రోజుకు రూ.3వేల అద్దె తీసుకోనున్నారు.

ప్రతి పేదవాడికి అండగా ఉంటాం


వాజేడు: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర


వెంకటాపురం(కె) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఏజెన్సీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వాజేడు/వెంకటాపురం(కె) : ప్రతీ పేదవాడికి అండగా నిలుస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాజేడు, వెంకటాపురం(కె) ఏజెన్సీ మండలాల్లో ఆయన బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన, పాత్రాపురం గ్రామంలో రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దున ఉన్న టేకులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పైలట్ ప్రాజెక్టులో భాగంగా పలు ఇళ్లకు భూమిపూజ చేశారు. వాజేడు మండల కేంద్రంలోని నాగారం గ్రామం నుంచి పాయబాటలు గ్రామం వరకు రూ.4 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఏడ్జెర్లపల్లి నుంచి బొమ్మనపల్లి వరకు రూ.3 కోట్లతో నిర్మించే బీటీ పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఎంపీడీఓ భవనానికి శంకుస్థాపన చేశారు. కొత్తగా నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. పది నెలల కాలంలోనే 57, 662 ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. భూభారతి చట్టం పేదరైతులకు చుట్టంగా మారిందని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో జూన్ 2న రూ.6వేల కోట్లు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపడిన అనంతరం నూతన పథకాలు అమలు చేస్తామన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. మారుమూల టేకులగూడెం నుంచే అన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెడతామన్నారు. మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్ భార్య రాంబాయి, కూలి పనులను చేసుకునే ఉయిక అర్జున్ భార్య సావిత్రి మంత్రి పొంగులేటి శ్రీనువాస్‌రెడ్డిని కలిసి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి అందలేదని చెప్పారు. స్పందించిన ఆయన త్వరలోనే వచ్చేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టేకులగూడెం వద్ద రైతులు మంత్రిని సన్మానించి నాగలిని బహూకరించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, వెంకటాపురం(కె) సీఐ కుమార్ ఆధ్వర్యంలో టేకులగూడెం వరకు రహదారి వెంట పోలీసు బలగాలు భద్రతగా ఉన్నాయి. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, ఎస్పీ శబరీష్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ, ఆర్డీఓ వెంకటేష్, ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సొంత విత్తనాలే శ్రేయస్కరం




ప్యాకింగ్ చేసిన వరి విత్తనాల బ్యాగులు

- నకిలీల బారిన పడకుండా రైతుల ముందుచూపు
- ప్రతి ఏడాది విత్తనాల కొనుగోలుతో ఆర్థిక భారం

ఖిలా వరంగల్: ఏడాదంత శ్రమించినా.. పంట దిగుబడి లేకుంటే రైతుల కష్టం వృథా అవుతుంది. పంట దిగుబడి తగ్గడానికి ప్రకృతి వైపరీత్యాలు ఒక కారణమైతే.. మరో ప్రధాన కారణం విత్తనాల ఎంపిక. విత్తనాల వల్ల ఎందరో రైతులు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో గత ఏడాది మిరప, పత్తి అంతకుముందు వరి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది. పూత, కాత దిగుబడి రాకపోవంతో అనేకమంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈనేపథ్యంలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు గత రెండు ఏళ్ల నుంచి రైతులు సొంతంగా విత్తనాలను తయారు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. కల్తీల బెడద, కొనుగోలు భారం తగ్గించుకునేందుకు ఇంకొందరు మేలైన విత్తనాలను సేకరించుకుంటున్నారు. ఖరీదైన విత్తనాలు కొనుగోలు చేసినప్పటికీ పంట ఏపుగా పెరుగుతుందే తప్ప దిగుబడి వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని గత ఏడాది నష్టపోయిన రైతులు చెబుతున్నారు. నకిలీవిత్తనాలతో మిరప, మొక్కజొన్న, పత్తి సాగు చేసి కంపెనీల చుట్టూ పరిహారం కోసం తిరిగినా, గిట్టుబాటు అవడం లేదని వాపోతున్నారు. ఆకర్షణీయంగా సంచులతో విత్తనాలు నింపి ప్రత్యేక ఆఫర్ల పేరిట వ్యాపారులు రైతులకు ఎర చూపి అంటకడుతున్నారు. నష్టపోయిన రైతులను గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. విసిగివేసారిన రైతులు కొందరు గత ఏడాది పండించిన పంటలో కొంత భాగాన్ని వేరుగా చేసి నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటున్నారు. దీని వల్ల ఆర్థిక భారం తగ్గడంతోపాటు కల్తీల బెడద తగ్గనుంది.

జాగ్రత్తలు పాటించాలి..

విత్తన షాపుల్లో మేలైన విత్తనాలుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగితే మొత్తం పరిహారం రైతు ఖాతాలో జమయ్యేలా చూడాలి. మార్కెట్లో లభ్యమయ్యే విత్తనాలు కొనకుండా సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవడం మేలు. ప్రతి ఏడాది సొంత విత్తనాల ఉపయోగించి మేలైన దిగుబడిని సాధిస్తున్నా.

- పులి అశోక్, రైతు సూరిపెల్లి

ధాన్యాన్ని దాచి ఉంచాను..

గత ఏడాది వరకు విత్తనాలను కొనుగోలు చేశా. ఒక్కోసారి దిగుబడిలో తేడా వచ్చి పెట్టుబడి కూడా రాలేదు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టే మిరప పంటలో విత్తనాల ఎంపిక కీలకమైంది. లేకుంటే నష్టాలు తప్పవు. ఈ ఏడాది మేలైన వరి ధాన్యాన్ని దాచి ఉంచా. వాటితోనే సాగు చేసి అధిక దిగుబడి సాధించేందుకు ప్రయత్నిస్తా.

- జగపతి బాబు, రైతు, రాంగోపాల్‌పురం, వరంగల్

కుంభకోణాల కాంగ్రెస్

- అన్ని శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోంది
- మంత్రుల గాలి మాటలు.. చేతి వాటం
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

హన్మకొండ: నిధులు, ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూనే కాంగ్రెస్ నాయకులు కుంభకోణాలకు, అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని శాఖల్లో అవినీతికి పాల్పడుతున్నారని, చివరకు రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలనూ వదలడం లేదని దుయ్యబట్టారు. వీరి చేష్టలతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను దోపిడీ చేయడమే ఆదాయ మార్గంగా ఎంచుకున్న కాంగ్రెస్ మొన్న ధాన్యం టెండర్లలో రూ.1,100 కోట్లు, నిన్న పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్లు, నేడు రైతుల పంట కొనుగోలు కేంద్రాల్లో వినియోగించే తేమ శాతం కొలిచే యంత్రం, వేయింగ్ మిషన్, గ్రేడింగ్ మిషన్, టార్పాలిన్ షీట్ల టెండర్ల నిర్వహణలో టీజీ ఆగ్రోస్ దోపిడీకి పాల్పడిందని అన్నారు. తెలంగాణ ఆగ్రోస్ నిర్వహించిన టెండర్ల తేదీని చైర్మన్ అనుయాయుల కోసం మార్చడమే కాకుండా సమయం దాటిపోయిన తర్వాత సీల్ వేసిన బాక్స్‌లు ఓపెన్ చేసి టెండర్లు వేయించారని, దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలో బీఆర్ఎస్ వద్ద ఉన్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు 25 ఎక్సెస్‌తో సమయం దాటిన తర్వాత టెండర్ దాఖలు చేశారని, దీనిపై ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు నయాముద్దీన్, బండి రజనీకుమార్, శరత్‌చంద్ర, చాగంటి రమేష్ పాల్గొన్నారు.

కేయూ స్పోర్ట్స్‌బోర్డులో అవకతవకలు

- వీసీ, రిజిస్ట్రార్లకు వినతిపత్రాలు


వీసీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పరిశోధకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డులో అవకతవకలకు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలకు చెందిన నలుగురు పరిశోధకులు మహ్మద్ పాషా, పల్లవి, బుచ్చయ్య, అవినాష్ బుధవారం వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రానికి వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ, ఓ కాంట్రాక్టు సీనియర్ అసిస్టెంట్ కలిసి ఇష్టానుసారంగా స్పోర్ట్స్ బోర్డు పరిధిలోని పీడీలకు సంబంధంలేకుండా పలు క్రీడల టీమ్‌లకు ఓ వ్యక్తిని కోచ్ కమ్ మేనేజర్‌గా పంపారని ఆరోపించారు. 2022 నుంచి 2025 అకాడమిక్ ఇయర్ వరకు స్పోర్ట్స్ బోర్డు టీం లిస్టులు, పీడీల పేర్లు వారికి వినియోగించిన నిధులు సెటిల్‌మెంట్స్ బిల్లుపై కమిటీవేసి విచారణ చేపట్టి.. చర్యలు తీసుకోవాలని కోరారు. స్పోర్ట్స్ బోర్డు జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన వీసీ ప్రతాప్‌రెడ్డి.. స్పోర్ట్స్ బోర్డుపై కమిటీతో విచారణ చేపడతామని హామీ ఇచ్చారని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ పరిశోధకుడు మహ్మద్‌పాషా తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా..

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్


పూజలో పాల్గొన్న డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, తదితరులు

హన్మకొండ కల్చరల్ : విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ ప్రజల అభ్యున్నతికి, దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ హామీ ఇచ్చారు. బుధవారం హనుమకొండ భద్రకాళి రోడ్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం శ్రీగాయత్రిమాత, శివాలయంలో ఉదయం 6గంటల నుంచి సుప్రభాత సేవలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గుటోజు కేదారీశ్వరాచారి బ్రహ్మంగారి మూలమూర్తికి పంచామృతాభిషేకం, మేలుకొలుపు, పూజలు చేశారు. తర్వాత దేవాలయంలో వివిధ పుష్పాలతో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి ఆవాహన, గణపతిపూజ, నవగ్రహపూజ, మంటపారాధన, ఆరాధన పూజ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందాచారి, కార్యదర్శి జల్లిపెల్లి పెంటయ్యాచారి అధ్యక్షతన జరిగిన పూజ కార్యక్రమంలో బండా ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనసూరి చంద్రమౌళి, వేల్పుల దేవాచారి, పెండోట చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దీపక్(ఫైల్)

నడికూడ: హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమకొండ జిల్లా నడికుడ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్ల గ్రామానికి చెందిన మోకిడి దీపక్ (30)హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన బైక్‌పై ప్రయాణిస్తుండగా వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

ఈఎంటీ ఆత్మహత్యాయత్నం..?

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 108 ఈఎంటీ బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొద్ది రోజులుగా జీవీకే 108 విభాగం పైఅధికారులు వేధింపులతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఈఎంటీ బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో 108 వాహనంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే వాహనంలో ఉన్న మాత్రలు మింగినట్లు తెలిసింది. గమనించిన తోటి ఈఎంటీ, పైలెట్లు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించినట్లు సమాచారం.

ఏసుక్రీస్తు అందరికీ దేవుడు


వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్‌లో) ఆశీర్వాదాలు ఇస్తున్న పాల్సన్‌రాజ్

- దైవజనుడు పాల్సన్‌రాజ్
- ముగిసిన క్రీస్తు జ్యోతి ప్రార్థన పండుగలు

ధర్మసాగర్: సర్వమానవాళి కోసం భూలోకానికి వచ్చిన ఏసుక్రీస్తు ప్రజలందరికీ దేవుడని కరుణాపురం సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఫౌండర్, ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో 20వ క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం వార్షికోత్సవ ఐదు రోజుల ప్రార్థన పండుగలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్సన్‌రాజ్ మాట్లాడుతూ.. 2006లో ప్రారంభమైన క్రీస్తుజ్యోతి ప్రార్థన పండుగలు ప్రతి ఏటా కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ మాట్లాడుతూ క్రీస్తు జ్యోతి ప్రార్థన పండుగలకు వివి.ద రాష్ట్రాల నుంచి 5 రోజుల్లో లక్షకు పైగా తరలివచ్చి దీవెనలు పొందారని తెలిపారు. మందిరం పాస్టర్లు, సేవకులు, వలంటీర్స్, బ్రదర్స్, సిస్టర్స్, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

తండ్రికి సాయం చేస్తూ మృత్యుఒడిలోకి..

- ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


పోగుల ఉమేష్(ఫైల్)

డోర్నకల్: ఇంటిపనుల్లో తండ్రికి సాయం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఓ బాలుడు ట్రాక్టర్‌కిందపడి మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోగుల నర్సయ్య తన ఇంటిలో బాత్‌రూమ్ నిర్మాణానికి కావాల్సిన సైజురాయిని బుధవారం స్వంత ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చాడు. రాయిని కిందకు దింపేందుకు ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలో ఒంపుగా ఉన్న ప్రాంతంలో నిలిపి టైరుకు అడ్డుగా రాయిపెట్టాడు. తర్వాత ట్రాక్టర్‌ను ముందుకు కదిలించే ప్రయత్నం చేస్తూ కుమారుడు పోగుల ఉమేష్(17)ను టైరుకు అడ్డుగా ఉన్న రాయిని తొలగించాలని సూచించాడు. ఉమేష్ రాయిని తొలగిస్తుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా కదిలి టైర్లు ఉమేష్ మీదుగా వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉమేష్‌ను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఖమ్మంలోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఉమేష్ సెలవులకు ఇంటికి వచ్చి తండ్రికి పనుల్లో సహాయపడుతున్నాడు. కళ్లెదుటే కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉమేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి సోదరుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.